ఆత్మకథ :

# అయిదో ప్రకరణం: అప్పాయమ్మ

తురగా సుందరం

నాకు ఆ మధ్య వంట్లో కొంచెం నుస్తీగా ఉంటోఉండేది. మావారు మా వీధిలో ఉన్న డాక్టరుచేత మందిప్పించేరు. శరీరం అట్టే అలసట పెట్టకూడదు నాలుగురోజులపాటు ఎవరన్నా వంటలక్కని పెట్టుకోమని సలహా యిచ్చేడు వైద్యుడు.

పెళ్ళిళ్లరోజులు. ఎవరో అన్నట్లుగా అన్నిటితోపాటు వంటవాళ్ళకికూడా రేషనింగు, రేషనింగుతోపాటు నల్లమార్కెట్టు వచ్చేయి. అతి కష్టంమీద అప్పాయమ్మ అనే పూర్వసువాసినిని రోజుకు రెండురూపాయిల చొప్పున కుదిర్చేరు మా ఆయన.

ఏదో కొన్నాళ్ళపాటు అలసట లేకుండా మందు పుచ్చుకుంటూఉంటే ఆరోగ్యంగా ఉంటుందికదా అని అనుకున్నాను.

మొదటిరోజు చీకటితోటే వచ్చింది వంటావిడ కొత్తగా వచ్చేను గనుక యింట్లో ఏవేవి ఎక్కడెక్కడున్నాయో చూపిస్తే తనపని తను చేసుకుంటానంది. మధ్యగదిలో ఉన్న బియ్యం, పక్కనఉన్న పప్పులు, వంటింట్లో ఉన్న మిగిలిన వస్తువులు, గిన్నెలు చూపించి ఏ ఏ గిన్నెలు దేనికి ఉపయోగిస్తామో, తరువాత వండేమి చెయ్యాలో అంతా చెప్పేటప్పటికి ఎనిమిదిగంటలైంది.

ఇంక నా పని ఏమీ లేదుకదా అని ఆయాసంగా ఉంటే కాస్త నడుం వాల్చేను.

ఇంతలోకే మళ్ళీ ఆవిడ వచ్చి తను పెద్దదాన్ననీ చత్వారం — దృష్టి సరిగా ఆనదు కనుక నేను బియ్యంలో రాళ్లు తీసిపెడితే తన పని తను చేసుకుంటానంది. సరేకదా అని ఆ కాస్త పని నేనే చేసేను.

ఆ రోజున పాలవాడు ఆలస్యంగా వచ్చేడు. నేను అప్పాయమ్మని పిలిస్తే పలుకలేదు. దొడ్లో నూతిదగ్గర స్నానం చేస్తోంది కాబోలని అనుకుని నేనే పాలు తీసుకుని కుంపటంటించి దానిమీద పెట్టి మళ్ళీ కాస్సేపు నడుంవాల్చేను. ఇంకా ఊడిపడలేదు ఆవిడ.

ఆ పాలు కాస్తా పొంగిపోతాయేమో అని నేను అప్పుడే కూర్చుని పాలు కాగడం అయ్యాక దింపి అలమారుగూట్లో పెట్టి మళ్ళీ ఆయాసంగా ఉంటే గోడకి జేర్లబడి కూర్చున్నాను.

తొమ్మిది గంటలయ్యాక ఆవిడ వంటింట్లో ప్రవేశించింది. "అదేమిటమ్మా! అలాగ చేస్తే ఎలాగ? మావారు పదిగంటలకల్లా ఆఫీసుకు వెళ్లాలి. ఇప్పటికికూడా వంట మొదలెట్టలేదంటే! 'పెద్దదాన్ని కాదుటమ్మా! కాస్త మడీ, ఆచారం ఉన్నాయి. అందుకని కాస్త ఆలస్యం అవుతే అవుతుంది. ఈ పూటకి ఎలాగోలాగ సర్దుకుంటే తరువాత అన్నీ గంటలప్రకారం జరుగుతాయి' అంది

సరే ఆ పూటకి గడుపుకోవాలి, హోటల్లో భోజనంచేసి ఆఫీసుకు వెళ్ళమని మా వారితో చెప్పేను. పాపం ఆయన సరేనని వెళ్ళిపోయారు.

మళ్ళీ కాస్త కూచుందామని అనుకుంటే వంటావిడ వచ్చి 'మీకు ఎంతెంత బియ్యం కావాలో నాకు తెలియదు. మీరు కొంచెం ఇలా వచ్చి కొలిచి గిన్నెలో పోస్తే నేను తక్కిన పనులుచేసుకుంటా'నంది. దాంతరువాత కొంచెం పులుసులోకి చింతపండూ, కాస్త కూరలోకి ఉప్పూ వగైరా

లన్నీ చూపించమంటూ మూడువంతుల ముప్పాతిక వంతు నా చేతే చేయించింది. ఇదేమిటిరా ఖర్మం, సుఖపడదామని వంటలక్కని పెట్టుకుంటే నాకు పని తప్పలేదు సరికదా ఆ మనిషికి అనవసరంగా డబ్బు యిచ్చుకోవడం ఒకటి అనిపించిందికాని, ఏదో మొదటిరోజుకదా తరువాత అన్నీ సరిగ్గానే జరిగిపోతాయని సమాధానపరచుకున్నాను.

మొత్తంమీద ఒంటిగంటకి వంటైంది.

అసలే ఒంట్లో బాగాలేదు, దానిపైన వంట పని, దానిపైన ఆవిడతో వాగడం యివన్నీ కలిసి నాకు చాలా ఆయాసం కలిగిస్తే భోజనం అవగానే మాట్లాడకుండా పడుకున్నాను. ఆ పడక పడక సాయంత్రం నాలుగు గంటలకి మెళుకువ వచ్చింది.

మావారికి టీ వేళైందని ఖంగారుపడి లోపలికి వెళ్ళిచూసుకదా ఎవ్వరూలేరు. ఎంగిళ్ళు, విస్తళ్ళు అలాగే ఉన్నాయి అన్నంగిన్నె, పులుసురాచ్చిప్ప, కూరపళ్ళెం లేవు. కొంచెం ఆలోచించగానే అప్పాయమ్మ యింటికి తీసుకువెళ్ళి ఉంటుందని తోచింది. అప్పటికి ఊరుకుని టీ నీళ్ళు పెట్టి కూర్చున్నాక మా వారు వస్తే టీ చేసి యిచ్చాను.

సాయంత్రం అయిదుగంటలయ్యాక వచ్చింది వంటావిడ ఖాళీ గిన్నెలు పళ్ళెం చేత పట్టుకొని. 'ఏవమ్మా! విస్తళ్ళయినా తీయలేదు, టీవేళకీ కూడా రాలేదంటే, 'నా మేనమామ కొడుకు బావమరది ఒకడు రాదున్నాడు. పాపం, వాడికి వండిపెట్టే దక్షత లేకపోతే మడిబట్టతో కాస్త అన్నం తీసుకెళ్ళి, వాడిభోజనం అయ్యాక కొంచెంసేపు నడుం వాల్చి వచ్చేటప్పటికి ఆలస్యం అయిందికాబోలు. ఏదో యిది మొదటిరోజులెండి. కొంచెం సర్దుకోవాలి' అంది.

ఇళ్ళన్నీ కడిగి వంట మొదలు పెట్టేటప్పటికి ఎనిమిదిగంటలైంది. తరువాత దృష్టిసరిగాఅనదని ఒక్క అన్నమే వండింది. ఆ పూట రాత్రి తొమ్మిది గంటలకి ఊరగాయలతో భోజనం.

ఇక రెండవరోజు—

పొద్దున్న ఎనిమిది గంటలయ్యాక వచ్చింది ఆవిడ ఆరోజు పాలవాడు పెంద్రాళే వస్తే కాఫీ మళ్ళీ నా చేతులతోనే తయారైంది. 'ఏవమ్మా! ఇంత ఆలస్యం చేస్తేఎలాగ?' అంటే, వాళ్ళ కుర్రవాడికి ఒంట్లో బాగుండకపోతే కొంచెం ఆముదం పట్టి సముదాయించి వచ్చేనంది. ఆవిడకే వంట వదిలిపెడితే

—నల్ల....దనానికి కారణం.



"ఆదేమిటీ?!! నీ పెదేలు అంత నల్లగా ఉన్నాయి?"

"మరేంలేదు. లిప్‌స్టిక్ బ్లేక్‌మార్కెట్టులో కొని తెచ్చిఉంటారు మా ఆయన."

---

మా ఆయనకి మళ్ళీ హోటలు భోజనమే ప్రాప్తి అవుతుందేమోనని నేనే చెయ్యి చేసుకుని చాలా మట్టుకు కానిస్తే పొద్దుటయ్యేవ పదిగంటలకి వంట యింది. మా వారు గబగబా నాలుగు మెతుకులు నోట్లో వేసుకుని ఆఫీసుకు వెళ్ళిపోయారు.

మా భోజనాలు అయ్యాక యధాప్రకారం ఆవిడ గిన్నెలు చేత్తో పట్టుకుని బయటకు నడిచి, మళ్ళీ సాయంత్రం ఐదుగంటలకి ప్రత్యక్షమయింది. మళ్ళీ ఎందుకింత ఆలస్యం అయిందంటే వాళ్ళ మేనమామ కొడుకు బావమరదియొక్క పినతండ్రి, వేలువిడిచిన మేనమామ వచ్చారనిన్నీ, బాగుండదని వాళ్ళతో పిచ్చాపాటీ కాస్త మాట్లాడుతోండగా ఆలస్యం అయింది కాబోలంది. కాని తరువాత మాటవరుసకి 'మా యింటికి మా మేనత్త, పిల్లలు రేపువస్తారు, ఒక వారంరోజులపాటుంటారు' అన్నాను. ఆవిడ ఏమీ మాట్లాడలేదు. రాత్రి యధాప్రకారం ఊరగాయలతో భోజనం అయ్యాక వెళ్ళిపోయింది.

మూడోరోజు పొద్దున్న ఏడైంది, ఎనిమిదైంది, తొమ్మిదైంది. ఎక్కడా వంటావిడ దర్శనంలేదు. పదిగంటలబండికి మేనత్తా, పిల్లలుకూడా వచ్చేరు. ఏదో ఉత్తిపప్పు, పచ్చిపులుసు చేసుకుని తిన్నాం, పోనీ ఏమయిందా అని వంటావిడ యింటికి కబురు పెట్టితే తను నాకేగాని మా బంధులకి వంట చెయ్యడానికి ఒప్పుకోలేదనిన్నీ, తనకు ముట్టవలసిన డబ్బు తక్షణం పంపవలసిందనీ జవాబు.

మళ్ళీ అప్పటినుంచీ వంటమనిషి పేరెత్తితేఒట్టు